వ్యాస కౌముది



# నాచనసోమనాథుడు - 2

- బాలాంత్రపు వేంకటరమణ

## (క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

మహాభారతం, ఉద్యోగపర్వంలో తిక్కనగారు సంజయ రాయబారాన్ని అత్యద్భుతంగా నిర్వహించారు. శ్రీకృష్ణ రాయబారం గురించి చెప్పనే అక్కరలేదు. అది జగద్విఖ్యాతం. ఈ రెండు రాయబారాల్లో తిక్కన సోమయాజిగారి రాజకీయ దురంధరత ప్రతి మాటలోనూ, కదలికలోనూ ప్రస్ఫుటం ఔతుంది. నాచన సోమన్న ఉత్తరహరివంశంలో జనార్దనుడి రాయ బారాన్ని అంత రసవంతంగానూ పండించాడు.

బ్రహ్మదత్తుడు సాళ్వదేశానికి రాజు. అతనికి ఇద్దరు భార్యలు. చాలాకాలం సంతానం లేదు. పదేళ్ళు తపస్సుచేస్తే పరమేశ్వరానుగ్రహం వల్ల ఇద్దరు కుమారులు జన్మించారు. వారి పేర్లు హంసుడు, డిభకుడు.

బ్రహ్మదత్తుడికి ఒక స్నేహితుడున్నాడు. అతని పేరు మిత్రసహుడు. ఇతడికీ సంతానంలేదు. ఇతడుకూడా పదేళ్ళు తపస్సు చేయగా విష్ణుమూర్తి అనుగ్రహం వల్ల ఒక కుమారుడు జన్మించాడు. అతడి పేరు జనార్దనుడు . జనార్దనుడు విష్ణుభక్తుడయ్యాడు.

ఈ ముగ్గురు పిల్లలూ స్నేహంగా పెరుగుతూ సమస్త విద్యలూ నేర్చుకున్నారు. మహావీరులయ్యారు .

హంస-డిభకులు హిమాలయాలకు వెళ్ళి శివుణ్ణి గురించి తపస్సు చేశారు. దేవాసురల చేతిలో ఓటమిలేకుండా ఒక వరం, బ్రహ్మాస్త్రంతో సహా సకల అస్త్రాలూ మరో వరంగా పొందారు. నిత్యం వారికి అంగరక్షకులుగా ఉండేలాగా ఇద్దరు ప్రమథుల్ని కూడా సంపాదించారు. పరమేశ్వరుడి వల్ల పొందిన వరాలవల్ల వాళ్ళు గర్వాంధులై విఱ్ఱవీగ సాగారు. వీళ్ళు ఒకసారి వేటకని అడివికి వెళ్ళి అక్కడ కొందరు ఋషుల్ని పీడించి దుర్భాషలాడారు. వారిలో దుర్వాస మహర్షి కూడా ఉన్నాడు. ఆయన ఎంతటి ముక్కోపి అయినా, ఎంతో నిగ్రహం పాటించి వీరిని శపించడమో, భస్మం చేయడమో చేయకుండా ద్వారకకు వెళ్ళి శ్రీకృష్ణునికి అంతా విన్నవించాడు. శ్రీకృష్ణుడు హంస డిభకుల్ని సంహరిస్తానని ప్రతిజ్ఞ చేస్తాడు.

వేటనుండి తిరిగి వచ్చాకా, హంస-డిభకులు రాజసూయ యాగంచెయ్యమని తమ తండ్రి బ్రహ్మదత్తుడిని ప్రోత్సహించారు. మేం దిగ్విజయం చేసి యజ్ఞ సంభారాలన్నీ సమకూరుస్తామన్నారు. బ్రహ్మదత్తుడు అంగీకరించాడు.

అయితే జనార్దనుడు వారికి హితం చెప్పాడు. ధరణి ఇంగిలాల పుట్ట. అగ్ని కణాలలాంటి గొప్ప రాజులతో, శూరులతో, మహా వీరులతో ధర నిండి ఉంది. రాజసూయ యాగం చేయాలంటే వారందరినీ జయించాలి. అది జరిగే పని కాదు. అనర్ధకారణం ఔతుంది అని చెప్పడానికి ప్రయత్నించాడు. వారిని వారించే ప్రయత్నంలో జనార్దనుడు భీష్మ, బాహ్లిక, భీమ, బలరామాదుల పరాక్రమాలు

వివరించాడు. అజేయుడైన జరాసంధుడున్నాడని చెప్పాడు. ఈశ్వర వర ప్రభావంతొ వాళ్ళందరినీ ఎలగో అలాగ నిగ్రహించినా, శ్రీకృష్ణుని ముందు ఆ వరాలు ఏవీ పనిచేయవు అని చెబుతూ, శ్రీకృష్ణుని పరాక్రమం గుఱించి చెప్పిన పద్యం ఇది.

నరకాసుర ప్రాణ నాళోత్తఱణకేళి
  రణకేళి వలకేలి రమణ జూపె
కంసదానవశిరః కమల కృత్తన మేలు
  తన మేలుచేయి పెద్దలకు నొసగె
చాణూర ముష్టిక క్షతజ కీలాలంబు
  నాలంబులోనెల్ల నలవు వఱపె
ముర హయగ్రీవాంత్రమూల ఫేనావళి
  నావలిదలగ జీకాకు వఱచె

వీర రస సార కాసార విహరణంబు
విష్ణునకు నొప్పు నతనితో విగ్రహింప
దొరకొనిన వచ్చు మనకు "మద్దులు మునింగి
పాఱ వెంపళ్ళు తమకెంత బంటి" యనుట.

నరకాసురుణ్ణి అవలీలగా సంహరించాడు. అతడి ప్రాణనాళాలను (తూడులు) పెకలించడం (ఉత్తరణం) ఒక కేళి. అటువంటి రణక్రీడలో తన ఎడమ చేతి గొప్పదనం (వలకేలు – దాని రమణ = వలకేలి రమణన్) చూపించాడు.
నరకాసురుడంతటివాణ్ణి ఒక తూడుని పీకినట్టు హేలగా కేళీ విలాసంగా ఎడంచేత్తో పీకేశాడు .
ఇక కంసాసురుడు. వాణ్ణి కుడిచేత్తో పీకేశాడు. కంసుడి శిరస్సు ఒక కమలం. దాన్ని తుంచెయ్యడం (కృత్తనము) ఒక పని. ఆ పనిని ఏలినది –శ్రమ లేకుండా నిర్వహించినది – తన మేలు చేయి. మేలయిన చేయి – కుడి చేయి. దాన్ని శ్రీకృష్ణుడు పెద్దలకు ఇచ్చాడు (ఒసగెన్). కంసుణ్ణి చంపి తన కుటుంబంలో ఉన్న పెద్దలకీ ఇంకా సజ్జనులకీ అభయహస్తం ఉచ్చాడని అర్థం.
చాణూర–ముష్టికుల్ని చీల్చిచెండాడి వాళ్ళ గాయాల్లోంచి ప్రవహించే రక్తం (క్షతము = గాయము, క్షతజము = రక్తము) అనే నీటిని (కీలాలము) రణరంగం అంతటా (ఆలంబులోన్ ఎల్లన్) మళ్ళించాడు (అలవు వఱపె).
గుఱ్ఱంతల రాక్షసుడు హయగ్రీవుడు, మురాసురుడు. వాడి పొట్టలోపలి పేగుల్ని – వాటి మూలాల్ని (అంత్రమూల) అనే నురుగుల్ని (ఫేన + ఆవళి) అవతలికి తొలగిపోయేటట్టు (ఆవలి తలగన్) చీకాకు పెట్టేశాడు. పేగులు నురుగుల్లా తెల్లగా ఉంటాయిట. నురుగుల్ని చిమ్మినంత తేలికగా పేగుల్ని చిమ్మేశాడని.

వీర రసంతో నిండిన శ్రేష్ఠమైన సరోవరంలో (సారకాసారము) విహరించడం విష్ణుమూర్తికే చెల్లింది (ఒప్పున్). అతడితో యుద్ధానికి పూనుకుంటే (దొరకొనినన్) మనకు ఒక సామెతతో పోలిక వస్తుంది.అదేమిటంటే, మద్దిచెట్లు మునిగేట్టు ప్రవాహం పొంగిపారుతొంటే

వెంపలిచెట్లు (వెంపలి – వెంపళ్ళు) మనకేపాటి లోతు (ఎంతబంటి?) – అన్నట్టుంటుంది మనం కృష్ణుడితో తలపడడం. నరకాసుర కంసాదులకే దిక్కులేకపోతే మనం ఎంత ఆ మహానుభావుడితో పోరాడ్డనికి? (వెంపలి అంటే వరిమడికి ఎరువుగా తొక్కే ఒక చిన్నమొక్క). ఇంక సాక్షాత్తు ఆదిశేషుడి అవతారం అయిన బలరాముడి బాల పరాక్రమాల గురించి చెబుతున్నాడు.

**నిలువంజాలుదురే రణాంగణంబులో నీలాంబరాడంబరో**
**జ్జ్వలవేషంబు హలా హలస్థల హల వ్యాపార దోస్సారముం**
**బ్రళయాంభోధర సోదరారవము నొప్పన్ దర్ప మేర్పాటుగా**
**బలభద్రుండతి రౌద్రుడై కదిసినం బ్రత్యర్థి భూపాలకుల్**

బలరాముడిది నీలవస్త్రాల ఆడంబరంతో ఉజ్జ్వలమైన వేషం. నిత్యం మద్యపానం సేవిస్తూ ఉంటాడని ప్రసిద్ధి. హాలాహల మయమైన స్థలంలో కూడా – అటువంటి భీషణ రణరంగంలో కూడా తన హలాయుధ వ్యాపారం – దున్ని వేయగలగడం – సాగించగల భుజసారం (దోః భుజ, సారము – బలము) ఉన్నవాడు. లేదా, హాలాహలానికి స్థలమైన హలం – దాన్ని ఆయుధంగా ఉపయోగించే భుజబలం ఉన్నవాడు. ప్రళయకాల మేఘంతో సాటివచ్చే (ప్రళయ అంభోధరానికి సోదరమైన) అంటే ఆ మేఘగర్జనకి తోబుట్టువువంటి ఆరవం (హుంకారం, గర్జన) చెయ్యగలవాడు. ఆ వేషం, ఆ దోస్సారము ఈ ఆరవం ఒప్పగా, రీవీ దర్పం స్పష్టపడేట్టు బలభద్రుడు అతి రౌద్రుడై ఎత్తివస్తే – సమీపిస్తే (కదిసినన్) శత్రురాజులు (ప్రత్యర్థి – భూపాలకులు) రణరంగంలో నిలువగలుగుతారా? యుద్ధం చెయ్యడం, జయించడం మాట అటుంచు. ముందసలు ఎదిరించి నిలబడగలరా? అని అడుగుతున్నాడు జనార్దనుడు.

శ్రీకృష్ణభక్తుడైన జనార్దనుడు హంస–డిభకులతో చిచ్చరపిడుగైన సాత్యకి యొక్క శక్తిసామర్థ్యాలు వివరిస్తున్నాడు.

**వికల వ్యూహ విధా విహస్తభటమై విధ్వస్తమాతంగమై**
**శకలీభూత శతాంగమై శరఘటా శల్యాయమానాశ్వమై**
**సికతాసేతువు నిమ్నగా రయముచే జిందైన చందాన సా**
**త్యకిచేతంబడు శతృసంఘము దశాదైన్యంబు సైన్యంబునన్**

శత్రుసంఘం అది ఎంతటిదైనా సాత్యకి చేతిలో ఇట్టే నశిస్తుంది. శత్రుసైన్యంలో దశాదైన్యం – దీన దశ – ఆవరిస్తుంది. ఇసుకతో (సికతా) కట్టిన వారిధి (సేతువు) సెలయేటి ప్రవాహవేగంతో (నిమ్నగా – రయమునన్) చెల్లాచెదరై కొట్టుకుపోయినట్టు (చిందైన చందమున) శత్రుసంఘం క్షణంలో మాయమైపోతుంది.

ఎలాగంటే – శత్రువులు పన్నిన వ్యూహవిధానమంతా వికలమైపోయి (వికలవ్యూహవిధా) భటులు చెదిరిపోతారు (విహస్త భటమై). గజసైన్యం (మాతంగాలు) విధ్వస్తమైపోతుంది. రథాలు (శతాంగాలు) తుత్తునియలైపోతాయి (శకలీభూత). బాణసమూహంతో – బాణపరంపరతో (శరఘటా) అశ్వాలు శల్యాయమానమైపోతాయి. గుచ్చుకున్న బాణపు ములుకులతో వాటి శరీరాలు నిండిపోతాయి. పదాతి – గజ – రథ – అశ్వ సైన్యాలతో బలిసివచ్చిన శత్రుసంఘం సాత్యకి చేతిలో ఇట్టే నాశనమైపోతుంది.

పద్య నిర్మాణంలో సమతూకం సాధించడం అనేది ఒక రచనా శిల్ప కళ. తెలుగు ప్రాచీన సాహిత్యంలో గొప్ప సమతూకం సాధించిన పద్యాలను ఉదహరించేటప్పుడు నాచన సోమనాథుడు రాసిన పై పద్యాన్ని చెబుతారు పండితులు.

ఇందాకా మనవి చేశాను. సోమన గారి ప్రభావం పోతనగారి రచనలో కొన్నిచోట్ల కనిపిస్తుంది అని. ఇదిగో ఈ పద్యం మరొక ఉదాహరణ.

**శరవిచ్ఛన్న తురంగమై పటుగదా సంభిన్న మాతంగమై**
**యురుచక్రాహత వీర మధ్య పద బాహు స్కంధముఖ్యాంగమై**
**సురభిత్సైన్యము దైన్యముం బొరయుచున్ శోషించి హైన్యంబుతో**
**హరి మ్రోలన్ నిలువంగ లేక పరచెన్ హాహా నినాదంబులన్**

భాగవతం నరకాసుర వధ కథలో – దేవతల్ని కూడా గడగడలాడించిన నరకాసురుడి సైన్యం, శ్రీకృష్ణుని శర–గద–చక్ర ప్రహారాలతో చెల్లాచెదరైపోయిన దీనావస్థను పోతన గారు వర్ణిస్తున్నాడు.

ఈ పద్యం నాచన సోముని "వికల వ్యూహ విధా విహస్త భటమై..." పద్యాన్ని తలపించడం లేదూ? రెండూ మత్తేభ వృత్తంలోనే సాగాయి.

సరే, ప్రస్తుతానికొస్తే జనార్దనుడు చెప్పినదాన్ని హంసుడు లెక్క చేయలేదు. తీసి అవతల పాడేసాడు.

**కలుద్రావంబని యాదవులు ఖడ్గాఖడ్గి వాదింతురే**
**కలగం బాఱుట గాక; పంతములకుం గంసారి సైరించినం**
**గలనం బ్రాణముతోన పట్టువడు, నింకన్ సాత్యకిన్ గీత్యకిన్**
**బలభద్రున్ గిలభద్రు నా యెదుర జెప్పం జొప్ప దప్పుంజుమీ!**

ఏంటయ్యా జనార్దనా, ఆ యాదవుల గురించి అంత గొప్పగా చెబుతున్నావు! ఆ యాదవులకు కల్లు త్రాగటం ఒక్కటే పని. వాళ్ళు మాతో యుద్ధం చేయడమే !? వాళ్ళు కత్తికి కత్తి దూసి జవాబు చెబుతారా, భయపడి పారిపోతారు గానీ! యాదవుల్లోకెల్లా మహావీరుడు, కంసుణ్ణి చంపిన కృష్ణుడు అంటున్నావే, ఆ కృష్ణుడు ఆ అహంకారంతో ఒకవేళ పంతానికిపోతే (పంతమునకున్ సైరించినన్), రణరంగంలో (కలనన్) ప్రాణాలతో సహా పట్టుబడిపోతాడు. అంతటి కృష్ణుడిపనే ఇలా అయితే ఇక సాత్యకి – గీత్యకి, బలభద్రుడు–గిలభద్రుడు అంటూ వాళ్ళ మాటే నా దగ్గర (నా యెదురన్) చెప్పవద్దు. వాళ్ళ ఊసెత్తితే చొప్పు తప్పుతుంది సుమా – అంటే ఔచిత్యభంగం ఔతుంది సుమా అన్నాడు.

జనార్దనుడు ఎంత వారించినా వినకుండా హంస హంసడిభకులు అతన్ని శ్రీకృష్ణుడి వద్దకు రాయబారానికి పంపించారు " మేము రాజసూయం చేస్తున్నాం నువ్వు యాగానికి కావలసిని ' ఉప్పు ' ని కప్పంగా పంపించు" అని సందేశం పంపించారు . ఈ జనార్దనుడు కృష్ణ భక్తుడు. తాను దర్శించాలని చాలా కాలంగా కోరుకుంటున్న శ్రీకృష్ణుడి దగ్గరికే తన ప్రభువు పంపుతున్నాడు . తీర్థమూ–స్వార్థమూ కలిసివచ్చాయి. జనార్దనుడి మనసు పరవశించిపోతోంది . ద్వారకకి వెళుతూ అతను తనలో తాను ఇలా అనుకున్నాడు :

**యదుకులాంబుధి చంద్రు నానందమున జూచు**
**రామాది హితచకోరములలోన**

దనుజారి పారిజాతము జేరి పొదిగొన్న
 రాజన్య రాజకీరములలోన
వసుదేవసుత సరోవరములో నోలాడు
 సనకాది దివ్యహంసములలోన
గోపాల నవపుష్పగుచ్ఛంబు మూగిన
 పరిచారికా ద్విరేఫములలోన
గలయ దొలు బాము నోములు గలవు గాన
సెలవులేక జన్మంబులు చెడియె నాకు
మీద జన్మంబు గలుగ నిర్మించెనేని
కమలజుని పేర దాపటి కాలి బొమ్మ.

యదువంశం అనే సముద్రానికి చంద్రుడు శ్రీకృష్ణుడు . పున్నమి నాడు సముద్రం ఉప్పొంగుతుంది. శ్రీకృష్ణుడివల్ల యదువంశం పెంపు వహించింది. "యదుకులాంబుధి చంద్రుడు " శ్రీకృష్ణుడు. అతన్ని నిత్యం ఆనందంతో చూస్తున్నారు, చూసి అనందిస్తున్నారు బలరాముడు మొదలైన హితులు (ఇష్టులు) వాళ్ళు చకోరాలు. హిత చకోరాలు. ఆ చకోరాల్లో నేనిప్పుడు కలవబోతున్నాను .

దనుజారి (దనుజ + అరి) రాక్షస సంహారకుడైన శ్రీకృష్ణుడు ఒక పారిజాతం – ఒక కల్పవృక్షం .అతణ్ణి చేరి చుట్టూ పరివేష్టించి ఉంటారు రాజన్యులు. ఆ రాజన్యులే రాచిలుకలు (రాజకీరము = శ్రేష్టమైన చిలుక) వారిలో నేనూ ఒక రాచిలుకగా కలవబోతున్నాను.

వసుదేవుని సుతుడు శ్రీకృష్ణుడు. ఆయన ఒక సరోవరం వంటి వాడయితే అందులో సనక–సనందాదులు దివ్యహంసల లాగా ఓలలాడుతుంటారు. ఆ హంసల్లో నేనూ కలవబోతున్నాను .

గోపాలుడు ఒక కొత్తరకం పూలగుత్తి (నవపుష్పగుచ్ఛము) పరిచాకలు అనే తుమ్మెదలు దానిచుట్టూ మూగి ఉంటాయి. నేనూ ఒక తుమ్మెదగా వారిలో కలవబోతున్నాను. ఆ పూలగుత్తిని ఆస్వాదించ బోతున్నాను.

ఇంతగొప్ప అవకాశం నాకు లభిస్తోందంటే దానికి కారణం తొలిజన్మలో (తొలిబాము) నేను నోచిన మంచి నోములు, వ్రతాలు ఏవో ఉండటమే. ఇప్పటికి ఈ అవకాశాన్ని అందించడం వల్ల నా పూర్వ జన్మలన్నీ చరితార్థమైనట్లే. ఇప్పుడు శ్రీకృష్ణ సందర్శనంతో ఈ జీవుడికి జన్మ సాఫల్యం సిద్ధిస్తోంది. కనక రాబోయే జన్మలన్నీ నిరుపయోగమే. నిష్ప్రయోజనమే. ప్రయోజనం, ఉపయోగం లేకపోవడంతో (సెలవు లేక) నాకు భవిష్యజ్జన్మలు నశించిపోయినట్టే . కృష్ణదర్శనంతోనాకు జన్మరాహిత్య స్థితి వచ్చేస్తుంది .

ఒకవేళ బ్రహ్మదేవుడు నాకు మళ్ళీ జన్మ కలిగేట్టు చేస్తే (మీద జన్మంబు గలుగ నిర్మించెనేని) ఆ బ్రహ్మదేవుని పేరుతో (కమలజుని పేర) నా ఎడమకాలికి (దాపటి కాలికి) బొమ్మ వేసుకుంటాను. అతడి పేరు వ్రాసి బొమ్మవేసి నా ఎడమ కాలికి కట్టుకుంటాను. (ఆ కాలంలో రాజులు తాము జయించిన శత్రురాజుల బొమ్మల్ని తమ ఎడంకాలిమీద పచ్చబొట్లు పొడిపించుకునేవారట. గండపెండేరాలమీద చెక్కించి కాలికి తొడుక్కొనేవారట.)

'ద్విరేఫము' అంటే రెండు రేఫలున్న(రకారాలు) పదం. అది "భ్రమర " శబ్దం. భ్రమరమంటే తుమ్మెద, ద్విరేఫము అంటే తుమ్మెద. జనార్దనుడు కతిపయ దినములు పయనించి, ద్వారక చేరుకున్నాడు. శ్రీ కృష్ణ దర్శనం అయింది.

(కొనసాగింపు వచ్చేసంచికలో..)